క్లుప్తంగా

ఫ్లై ఓవర్ వద్దని వినతి


ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

రణస్థలం: మండల కేంద్రంలోని జె.ఆర్.పురం ఎన్‌హెచ్‌–16 ఆరులైన్ల ఎలివేటెడ్ కారిడర్ (ఫ్లై ఓవర్) నిర్మాణ ప్రతిపాదనను వెనక్కి తీసుకుని అందరికి ఆమోదయోగ్యమైన బైపాస్‌ను నిర్మించాలని రణస్థలం ఫ్లై ఓవర్ వ్యతిరేక కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులను వారి క్యాంపు కార్యాలయాల్లో కలిసి మంగళవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై వారు మాట్లాడుతూ వ్యాపారులకు న్యాయం చేస్తామని, త్వరలో హైవే అధికారులను పిలిపించి అందరి సమక్షంలో ప్రాజెక్టు వివరాలు వెల్లడింపజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, మాజీ ఎంపీటీసీ ఇ.తిరుపతిరాజు, కమిటీ సభ్యులు పిన్నింటి సత్యంనాయుడు, దమ్ము శ్రీనివాసరావు, టేకి బ్రహ్మాజీ, బాలాజీ జగదీష్, జగిలింకి రమేష్, ఎన్. గురునాథ్, ఆకెళ్ల సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెలిగిన హైవే లైట్లు


లైట్లు బాగు చేస్తున్న సిబ్బంది

రణస్థలం: మండల కేంద్రం రణస్థలంలో ఇటీవల ఎన్‌హెచ్‌ఐ అధికారులు వేసిన లైట్లు రెండు వారాలకే మొరాయించడంపై 'హైవేపై అంధకారం' అనే శీర్షికన ఈ నెల 28న సాక్షిలో వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన హైవే అధికారులు మంగళవారం నిర్వహణ పనులు చేపట్టి హైవేపై లైట్లు వెలిగేలా చర్యలు చేపట్టారు.

సాగునీరు అందించండి

జి.సిగడాం: మడ్డువలస ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించి వరి పంటలను కాపాడాలని సర్పంచ్‌లు బోగాది అప్పలనాయుడు, తిరుమరెడ్డి వెంకటరావు, మీసాల రవికుమార్, కామొజుల సీతారాం, బెవర జగన్నాథం, పడాల అప్పన్న, మక్క నారాయణరావు కోరారు. ఈ మేరకు రైతులతో కలిసి మంగళవారం విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుకు విన్నవించారు. మధుపాం, దేవరవలసలో ఏర్పాటు చేసిన సభ్యత్వాల నమోదు కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మడ్డువలస కాలువ ద్వారా చుక్క నీరు రాక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు భూపతి శ్రీరామమూర్తి, కుమరాపు రవికుమార్ డబ్బాడ ఆదినారాయణ, కూర్మారావు, జక్కంపూడి దాస్, మాళీశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం


విరాళం అందిస్తున్న కోరాడ ఇందిర

శ్రీకాకుళం కల్చరల్: రిమ్స్‌లో అమలవుతున్న అన్నపూర్ణ నిత్య అన్నదాన పథకానికి గుజరాతిపేటకు చెందిన కోరాడ ఇందిర తన తండ్రి సూర్యం జ్ఞాపకార్థం తన తల్లి భాగ్యలక్ష్మీతో కలిసి రూ.10వేలు, పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన లోలుగు నూకరాజు తన మనుమడు సాయికిరణ్, దివ్య భారతిల కుమారుడు కుల్వంత్ నాయుడు పుట్టిన రోజు సందర్భంగా రూ.10 వేలు విరాళం అందించినట్లు జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మంగళవారం తెలిపారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గంగుల రమణబాబు, కార్యదర్శి కిల్లాన ఫల్గుణరావు పాల్గొన్నారు.

ఐటీఐతో ఉద్యోగ అవకాశాలు


విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: గతంతో పోలిస్తే ఐటీఐ శిక్షణ పొందిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. బలగలోని భారతి ఐటీఐ 40వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీఐ ట్రేడు/కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో భారతి ఐటీఐ యజమాని చిట్టి నాగభూషణం, కరస్పాండెంట్ చిట్టి సాయికిరణ్, మెండ దాసునాయుడు, అంధవరపు సూరిబాబు, గురుగుబెల్లి లోకనాథం, మాదారపు వెంకటేష్, డీఎల్‌టీసీ ఏడీ వై.రామ్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ మోహన్‌రావు, సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లై ఓవరే ఫైనల్..!

- రణస్థలం సెంటర్లో 45 మీటర్లు, శివారులో 65 మీటర్ల వెడల్పున వంతెన
- 25 సింగిల్ పిల్లర్లతో ఆరు లైన్ల మేర నిర్మాణం
- రూ.252.42 కోట్లు విడుదల చేసిన కేంద్రం
- బైపాస్‌తోనే అభివృద్ధి సాధ్యమంటున్న స్థానికులు, వ్యాపారులు

రణస్థలం :

మండల కేంద్రం రణస్థలంలో ఆరు లైన్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం దాదాపు ఖరారైనట్లేనని ఇటు ప్రజా ప్రతినిధులు, అటు హైవే అధికారులు చెబుతుండటంతో వ్యాపారులు, స్థానికుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఈ నిర్మాణం ఎక్కడి నుంచి ప్రారంభమై ఎక్కడ ముగుస్తుంది.. విస్తరణ ఉంటుందా.. షాపులు పోతాయా.. యథాతథంగా ఉంటాయా..అనేదే ప్రస్తుతం రణస్థలం మండలంలో హాట్‌టాపిక్. కేంద్రం ఇటీవల రూ.252.42 కోట్లు విడుదల చేయడమే ఇందుకు కారణం.

పరిహారం తగ్గింపుతో బైపాస్ రద్దు..

రణస్థలం మండలంలోని కొత్త పెట్రోల్ బంకు నుంచి లావేరు మండల పరిధిలోని రావివలస వరకు 4.2 కిలోమీటర్లతో బైపాస్ నిర్మాణానికి 2016లో గజిట్ నోట్ విడుదల చేసి రైతులకు పరిహారం ప్రకటించారు. అయితే రైతులకు అందిస్తున్న పరిహారం అధికంగా ఉందంటూ 30శాతం తగ్గించాలని 2019లో హైవే అధికారులు కొర్రీపెట్టారు. ఈ విషయమై హైవే అధికారులు, అప్పటి కలెక్టర్, ప్రజా ప్రతినిధులు రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులు మాత్రం ముందు ప్రకటించిన పరిహారం ఇవ్వాలని, లేదంటే భూములు ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. దీంతో చేసేది లేక హైవే అధికారులు బైపాస్ ప్రతిపాదనను విరమించుకున్నారు.

ఫ్లైఓవర్ వైపు అడుగులు..

బైపాస్ రద్దు చేసుకోవడంతో హైవే అధికారులు ప్రత్యామ్నాయంగా ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిద్దామని 2021లో ప్రతిపాదనలు పెట్టారు. అప్పటి నుంచి రణస్థలం మండల కేంద్రంవాసులు వ్యతిరేకిస్తూ వచ్చారు. ఈ క్రమంలో హైవే అధికారులు స్థానిక ప్రజా ప్రతినిధులను కలిసి పాత పెట్రోల్ బంకు నుంచి కొత్త పెట్రోల్ బంకు వరకు ఓపెన్ పిల్లర్లతో మూడు కిలోమీటర్లు పైచిలుకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మిస్తామని చెప్పారు. ఈ మేరకు డిజైన్లు సిద్ధం చేసి కేంద్రానికి పంపించినా అనుమతులు రాలేదు. స్థానికులు కూడా తీవ్రంగా వ్యతిరేకత వ్యక్తం చేయడం.. మూడు నెలలు పాటు టెంట్ వేసి నిరాహార దీక్షలు నిర్వహించడంతో ఆ అంశం అలా మరుగునపడిపోయింది.

కేంద్రం ప్రకటనతో ఉలికిపాటు..


కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఈ నెల 24న రణస్థలంలో ఆరు లైన్ల ఎలివేటెడ్ కారిడర్ మంజూరు చేస్తూ రూ.252.42 కోట్లు విడుదల చేయడంతో స్థానికులు ఉలిక్కిపడ్డారు. దీనిని వ్యతిరేకిస్తూ స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలకు వినతిపత్రాలు అందజేశారు. ఫ్లై ఓవర్ వద్దు.. బైపాస్ ముద్దు అని నినాదాలు చేస్తూ ఆందోళన సైతం చేపట్టారు. ఫ్లైఓవర్‌తో రణస్థలం అభివృద్ధి తిరోగమనం చెందుతుందని.. అదే బైపాస్ నిర్మాణం చేపడితే భూముల ధరలు పెరగడంతో పాటు రణస్థలం, జె.ఆర్.పురం, రావాడ, కొండములగాం, తాళ్లవలస వంటి పంచాయతీలు అభివృద్ధి బాటలో నడుస్తాయని గ్రామస్తులు ముక్తకంఠంతో చెబుతున్నారు. అయినా వీరి గోడు వినే వారే కరువయ్యారు.

అభివృద్ధి అంతే సంగతులు..



రణస్థలం ఇప్పుడిప్పుడే అభివృద్ధి బాటలో నడుస్తోంది. ఫ్లై ఓవర్ బ్రిడ్జితో వ్యాపారులు తీవ్రంగా నష్టపోతారు. అదే బైపాస్ నిర్మాణం చేపడితే భూములు ధరలు పెరిగి ఊరు అభివృద్ధి భాటలో నడుస్తుంది.

– ఇ.తిరుపతిరాజు, మాజీ ఎంపీటీసీ, రణస్థలం


హైవే అధికారులు విడుదల చేసిన రణస్థలం ఫ్లై ఓవర్ నమూనా చిత్రం

ఫ్లైఓవర్ నిర్మాణం ఇలా..

రణస్థలం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై సుమారు రెండు కిలోమీటర్ల మేర ఆరు లైన్ల రహదారి వేయనున్నారు. ఎస్‌ఎస్ పోర్టు నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు 45 మీటర్లు వెడల్పుతో 720 మీటర్లు పొడవునా 25 సింగిల్ పిల్లర్లతో ఓపెన్ ఫ్లై ఓవర్ నిర్మించనున్నారు. మిగిలిన సుమారు 1360 మీటర్లు ఫ్లై ఓవర్ ఎక్కిన దిగిన దగ్గర 65 మీటర్ల వెడల్పుతో వాల్ ఫ్లై ఓవర్ వస్తుంది. ఇక్కడ అవసరమైతే జాతీయ రహదారుల సంస్థ భూసేకరణ చేసే అవకాశముంది. మిగతా ప్రదేశాలు యథావిధిగా ఉంటాయని హైవే అధికారులు చెబుతున్నారు. మొత్తమ్మీద మండలం కేంద్రంలోని ఎర్రన్నాయుడు విగ్రహం నుంచి పాత పెట్రోల్ బంకు లోపే ఫ్లై ఓవర్ ఉండబోతుందని సమాచారం. రామతీర్థాలు కూడలి, సీతంవలస రోడ్డు, పాత పోలీస్‌స్టేషన్ రోడ్డు 60 అడుగులు విస్తరణ చేసే అవకాశముంది.


రణస్థలం మండల కేంద్రంలోని ఎన్‌హెచ్‌-16 జాతీయ రహదారి

జీవనోపాధికి నష్టం..



ఫ్లై ఓవర్ బ్రిడ్జి వల్ల భూసేకరణ జరిపితే మా షాపులు పోయి తీవ్రంగా నష్టపోతాం. 20 ఏళ్ల క్రితం కూడా ఇలాగే హైవే విస్తరణలో మా ఆస్తులు కోల్పోయాం. మరోసారి జరిగితే కోలుకోలేం.

– జి.రమేష్, జె.ఆర్.పురం గ్రామస్తుడు

నిబంధనల ప్రకారమే..

హైవే నిబంధనల ప్రకారం హైవే స్థలం పరిధిలోనే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తాం. కొత్తగా భూసేకరణ ఉండదు. హైవే, స్టేట్ రోడ్లు కలిసే చోట మాత్రం 60 అడుగుల విస్తరణ తప్పదు. 720 మీటర్ల మేర 25 పైగా సింగిల్ పిల్లర్లతో ఆరు లైన్ల ఫ్లైఓవర్‌ను 45 మీటర్లు వెడల్పున నిర్మిస్తాం. మిగిలిన ప్రాంతం 65 మీటర్ల వెడల్పున ఉంటుంది. రామతీర్థాలు కూడలి, సీతంవలస రోడ్డు, పాత పోలీస్ స్టేషన్ రోడ్డులో 60 అడుగుల మేర వెడ్పులు చేస్తాం.

– సీహెచ్ సతీష్, జాతీయ రహదారుల సంస్థ డిప్యూటీ మేనేజర్, విశాఖపట్నం

అడుగడుగునా గోతులు



శ్రీకాకుళం బలగ జంక్షన్ నుంచి సిద్ధిపేటకు వెళ్లేదారిలో సాయిసనత్‌నగర్ వద్ద భారీ గోతులు ఏర్పడ్డాయి. దీంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ గోతులతో ఒక్కోసారి ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

– శ్రీకాకుళం రూరల్

నిరుపయోగంగా అతిథి గృహం



చిలకపాలెంలో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో భవనం పాడైపోతోంది. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ భవనాన్ని వినియోగించేవారు. ప్రస్తుతం మొక్కలు, తుప్పల నిలయంగా మారింది.

– ఎచ్చెర్ల క్యాంపస్

చినుకుపడితే చిత్తడే



ఎచ్చెర్ల మండల కేంద్రాన్ని వెళ్లే రహదారిలో చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోతోంది. జాతీయ రహదారి వరకూ సీసీ రోడ్డు నిర్మించకుండా సుమారు 20 అడుగుల మేర వదిలేయడంతో అక్కడ వర్షపునీరు నిలిచి బురదమయంగా మారుతోంది.

– ఎచ్చెర్ల

క్రీడాకారిణికి అభినందనలు


వినూత్నను అభినందిస్తున్న డైరెక్టర్ బాలాజీ, అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్ : విద్యార్థులు క్రీడల్లో రాణించాలని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ) శ్రీకాకుళం క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట గోపాల ధన బాలాజీ అన్నారు. ఎస్‌ఎంపురం క్యాంపస్‌లో తొమ్మిదో రాష్ట్ర జూనియర్ ఇంటర్మీడియట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని తృతీయస్థానం సాధించిన ప్రీ యూనివర్సిటీ కోర్సు మొదటి ఏడాది విద్యార్థిని వినూత్నను అభినందించారు. ఈ నెల 24, 25 తేదీల్లో విశాఖపట్నంలో జరిగిన పోటీల్లో పాల్గొని మెరుగైన ప్రదర్శన ద్వారా జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌జీయూకేటీ క్యాంపస్‌లో క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ మోహన్‌కృష్ణ చౌదరి, ఫైనాన్స్ అధికారి వాసు, వెల్ఫేర్ అసిస్టెంట్ గేదెల రవి, పీడీలు రాజు, దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

మున్సిపల్ రోడ్డు ధ్వంసం


తవ్వేసిన రోడ్డు ఇదే..

శ్రీకాకుళం: నగరంలోని కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో నగరపాలక సంస్థకు చెందిన సీసీ రోడ్డును మూడు రోజుల క్రితం కొందరు ధ్వంసం చేశారు. రోడ్డు సమీపంలో ఉన్న ఆలయానికి పైపులైన్ వేస్తామని కొందరు చెప్పగా.. రోడ్డు తవ్వేందుకు స్థానికులు అభ్యంతరం తెలిపారు. అయినా వారు పట్టించుకోకుండా ఎమ్మెల్యే అనుమతి ఇచ్చారని, మున్సిపల్ అధికారులు అంగీకరించారని చెప్పి ప్రొక్లెనర్‌తో తవ్వేశారు. ప్రస్తుతం రోడ్డుపై రాకపోకలు సాగించేందుకు ఇబ్బందిగా మారిపోయింది. కాగా, రోడ్డు తవ్వేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. అనంతరం రోడ్డును పరిశీలించి, తవ్వినవారిని మందలించి వెళ్లిపోయారు. స్థానికులు నగరపాలక అధికారులు, జిల్లా కలెక్టర్, 1వ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన కమిషనర్ మంగళవారం రోడ్డును పరిశీలించిన రోడ్డు తవ్విన వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం కమిషనర్‌కు తెలియజేస్తామని డీఈ తెలిపారు.

రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు

శ్రీకాకుళం: ప్రారంభ దశలో రొమ్ము క్యాన్సర్‌ను గుర్తిస్తే చికిత్స సులభతరం అవుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ దుంగ హర్షవల్లి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థులు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మహిళా విభాగం సంయుక్త ఆధ్వర్యంలో రొమ్ముక్యాన్సర్‌పై అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో క్యాన్సర్‌ను చేర్చి ఉచితంగా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రిమ్స్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షకీలా, ఆస్పత్రి వైద్యులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

300 రోజులుగా అన్నదానం


అన్నం వడ్డిస్తున్న సూర్య

రణస్థలం: మండల కేంద్రంలోని కేకే కాంప్లెక్స్ ఎదురుగా నిర్వహిస్తున్న ఉచిత అన్నదాన శిబిరం మంగళవారానికి 300 రోజులకు చేరుకుందని నిర్వాహకులు గొర్లె సూర్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు, బాటసారులు, కూలీల ఆకలి తీర్చడం ఆనందంగా ఉందన్నారు.

దివ్యాంగుల వైద్య శిబిరానికి స్పందన


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న సన్యాసినాయుడు

శ్రీకాకుళం పాతబస్టాండ్ : విభిన్న ప్రతిభావంతులకు సేవలు అందించడంలో న్యాయవ్యవస్థ ముందంజలో ఉంటుందని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. కలెక్టరేట్ సమీపంలోని బెహరా మనోవికాస కేంద్రంలో మంగళవారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 108 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సైకాలజిస్ట్ బి.సాయిరాం, విభిన్న ప్రతిభావంతుల సహాయ సంచాలకుడు కె.కవిత, జి.ఇందిరాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి అభినందనలు


భార్గవిని అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

శ్రీకాకుళం రూరల్: ఒంగోలులో ఈ నెల 27న జరిగిన 43వ ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్రస్థాయి సదస్సులో పాత్రునివలసలోని శ్రీ సాయిడెంటల్ కళాశాల విద్యార్థిని డాక్టర్ గుంటు భార్గవి బెస్ట్ అవుట్ గోయింగ్ స్టూడెంట్‌గా నిలిచి అవార్డు అందుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పి.కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. దంత వైద్యంలో ఆధునిక టెక్నాలజీని వివరించడంతో ఈ అవార్డు లభించిందని పేర్కొన్నారు. విద్యార్థిని కళాశాల డైరెక్టర్ జి.బి.వి.జి.రాజు, కార్యదర్శి డి.ఎస్.రెడ్డి, సిబ్బంది మంగళవారం అభినందించారు.

రెండో పట్టణ సీఐ బదిలీ

శ్రీకాకుళం క్రైమ్ : శ్రీకాకుళం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ గుండుమోను ఉమామహేశ్వరరావు విశాఖపట్నానికి మంగళవారం బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో విశాఖ వీఆర్ నుంచి పి.ఈశ్వరరావు కొత్త సీఐగా రానున్నారు. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి.

అలరించిన స్వరమాధురి


పాటలను ఆలపిస్తున్న గాయకులు

శ్రీకాకుళం రూరల్: స్వరమాధురి త్రివేణి సంఘం, శ్రీకాకుళం సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో మంగళవారం వాకలవలసలోని అభయాంజనేయ కల్యాణ మండపంలో నిర్వహించిన సినీ గీతాల స్వరమాధురి కార్యక్రమం ఎంతగానో అలరించింది. గాయనీ గాయకులు రాజరామ్మోహన్, కె.ఎల్.ఎన్.మూర్తి, మంగవేణి పలు గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో నిక్కు అప్పన్న, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు, లైన్స్‌క్లబ్ ప్రతినిధి పొన్నాడ రవి, విశ్రాంత డీఈఓ బి.మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

రిమ్స్‌లో సౌకర్యాలు కల్పించాలి


రిమ్స్‌లో సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం: రిమ్స్ ఆస్పత్రిలో సమస్యలు తిష్టవేయడంపై ఎమ్మెల్యే గొండు శంకర్ అసహనం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలో మంగళవారం సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిమ్స్‌లో సమస్యలతో పాటు సిబ్బంది కొరత పీడిస్తోందని, ఇక్కడి ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం పలువురు దాతలు ఫ్యాన్లు, లైట్లు వితరణ చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్, ఆస్పత్రి అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న స్వామివారు

ఎచ్చెర్ల : మండలంలోని కుశాలపురం ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించగా.. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి సిందూరాభిషేకాలు చేశారు.

ఉత్సాహంగా సివిల్ సర్వీసెస్ క్రీడా ఎంపిక పోటీలు


వాలీబాల్ పోటీలో మహిళలు

శ్రీకాకుళం న్యూకాలనీ: సివిల్ సర్వీసెస్ క్రీడా ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల(ఆఫీసు సబార్డినేట్ స్థాయి నుంచి జిల్లాస్థాయి అధికారి వరకు)కు ఏటా ఈ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా త్వరలో రాష్ట్ర పోటీలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు జరిగాయి. శ్రీకాకుళం కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా జిల్లా క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్, షటిల్ బాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, చెస్, హాకీ, బాస్కెట్‌బాల్, లాన్‌టెన్నిస్, టేబుల్‌టెన్నిస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, స్విమ్మింగ్, యోగా, తదితర 17 క్రీడాంశాల్లో ఎంపిక పోటీలను నిర్వహించారు. డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్ రావు ఆధ్వర్యంలో డీఎస్ఏ కోచ్‌లు పర్యవేక్షించారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి


చిలకపాలెం శివారులో ఏర్పాటు చేసిన క్రాకర్స్ దుకాణం

ఎచ్చెర్ల క్యాంపస్: దీపావళి సందర్భంగా మందుగుండు సామగ్రి అమ్మకాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఎచ్చెర్ల మండలంలో ఏడు దుకాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వడంతో ఎచ్చెర్ల, చిలకపాలెం, కేశవరావుపేట శివార్లలో షాపులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు విక్రయాలు చేపట్టాలని తహసీల్దార్ సింహాచలం, ఎస్సై సందీప్‌కుమార్ నిర్వాహకులకు సూచించారు. మరోవైపు కుప్పిలి, పూడివలస, కొత్తపేట ప్రాంతాల్లోని హోల్‌సేల్ దుకాణాల్లో సైతం అమ్మకాలు కొనసాగుతున్నాయి.

కత్తెర పురుగుతో జాగ్రత్త


మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

రణస్థలం: మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు ఉధృతి పెరగకుండా రైతులు అప్రమత్తంగా ఉండాలని రణస్థలం వ్యవసాయ సహాయ సంచాలకుడు వి.శ్రీనివాసరావు సూచించారు. బండిపాలెంలో మొక్కజొన్న పంటను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 100 గ్రాములును 500 మిల్లీలీటర్ల వేప నూనె కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏవో డి.వి జయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పీఎంఎంఎస్‌వైై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: మండలంలోని కుప్పిలి, బుడగుట్లపాలెం గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారి వై.సురేష్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ముసలినాయుడు హాజరై పీఎంఎంఎస్‌వై (ప్రధాన మంత్రి మత్స్యసంపద యోజన)పై అవగాహన కల్పించారు. ప్రభుత్వ రాయితీలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం సుడిదోమ వల్ల నష్టాలు, నివారణా చర్యలపై అవగాహన కల్పించారు.

పెరటి తోటలు పెంచాలి


పెరటి తోట సాగు చేస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పెరటి తోటలు పెంచాలని ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి సువ్వారి సన్యాసిరావు అన్నారు. ఎచ్చెర్ల అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో మంగళవారం పెరటి తోటపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ స్థలంలోనే పోషకాహార తోటలను పెంచవచ్చన్నారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పెరటి తోటల పెంపకానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు.